RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 181 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి బుధవారం 1-7-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిధి॥ నిజ జ్యేష్ఠ బహుళ పాడ్యమి ఉ॥6.19, పూ.షా. ఉ॥6.25, వర్జ్యం మ॥3.09 - 4.54, దుర్ముహూర్తం ఉ॥8.03-8.55, శుభ సమయం ఉ॥11.36-12.29, రాహుకాలం మ॥12.00-1.30, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥

## ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా




**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు పూర్తిస్థాయిలో రానందున, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 1న ఫలితాలను విడుదల చేయాల్సి ఉండగా, ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్సీ రివైజ్డ్ ఫలితాలు, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చిన అనంతరం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏడాది మే 12 నుంచి 20 వరకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజా నిర్ణయం ప్రకారం జులై 2 వరకు ఈఏపీసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది.



# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

- ఖనిజాలకు విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి
- మినరల్ వెల్త్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై అధ్యయనం
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక తవ్వకాల పర్యవేక్షణ
- గనుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ పక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మిగతా 2లో..

## మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ

తూర్పు కనుమలలో పులుల సంరక్షణపై చర్చ

రెండు ఆడపులులను ఇచ్చేందుకు సిఎం అంగీకారం



**ముంబయి, జూన్ 30 (ఆర్ఎన్ఎ):** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల మిగతా 2లో..

## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

మనం అభివృద్ధి చెందడమే కాదు.. వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి

గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**విశాఖపట్నం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యా లయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు మిగతా 2లో..



## మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

ఈయేడు కూడా కేజీకి రూ.4 చెల్లిస్తున్నాం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ



**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వారికి అండగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

## ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్



**న్యూఢిల్లీ, జూన్ 30 (ఆర్ఎన్ఎ):** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

## పారిశ్రామిక రంగంలో ఎపి ఊహించని ప్రగతి

స్పేస్, డ్రోన్ సిటీల నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకూ పురోగతి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్పేస్, డ్రోన్ సిటీల నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఊహించని ప్రగతిని సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గత ఐదేళ్ల పాలనతో పోలిస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో ఆంధప్రదేశ్ పారిశ్రామిక రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధప్రదేశ్‌లో పరిశ్రమల సంఖ్య పూర్తిగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక విధానాల్లో మిగతా 2లో..

## కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

- అదే వేగంతో ముందున్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- రెండు వాహనాల మధ్య నుజ్జునుజ్జు అయిన కారు
- చిన్నారి సహా ఇద్దరు మృతి



**విజయవాడ, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణా జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్, ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో మిగతా 2లో..

## మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ఎపి టాప్

రూ.1,495.50 కోట్ల రుణాల పంపిణీ

**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్ రుణాల అమల్లో 99.7 శాతం లక్ష్యాన్ని సాధించింది.రూ.1,500 కోట్ల రుణ లక్ష్యానికి గాను రూ.1,495.50 కోట్ల రుణాలను మహిళా పారిశ్రామిక వేత్తలకు పంపిణీ చేసింది. 1.50 లక్షల మంది మహిళలకు రుణాల అందించాలని లక్ష్యం పెట్టుకోగా, 1,47,840 మందికి వ్యక్తిగత పారిశ్రామిక రుణాలు అందించింది. ఎపీతో సమానంగా లక్ష్యాలను నిర్దేశించు కుని... టార్గెటులో కేవలం 15, 25 శాతం మాత్రమే బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు చేరుకున్నాయి. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎపి ప్రభుత్వం రుణాలు అందించడంలో అద్భుత పనితీరు కనబరుస్తుండ డంతో 2026-27 ఏడాదికి ఏపీకి 1.67 లక్షల మంది మహిళలకు రూ. 1670 కోట్లు రుణాలు అందించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలోనూ దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది.



మహిళల ఆర్థిక సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర నివేదికలు చెబుతున్నాయి. 2025-26లో 35,934 మంది లబ్దిదారులకు ప్రయోజనం మిగతా 2లో..

## బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

ప్రమాదంతో తల్లి మృతి..కొడుకు గాయాలు

**హైదరాబాద్, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. కన్న కొడుకు కళ్ల ముందే తల్లి దుర్మరణం చెందింది. మంగళవారం ఉదయం బహుదూర్ పల్లి గ్రామం మెయిన్ రోడ్‌పై మద్యం మత్తులో బొలెరో డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. బైక్‌పై వెళ్తున్న తల్లీకొడుకును బొలెరో వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి ఉదయ్ లతారెడ్డి(49) అక్కడికక్కడే మృతిచెందగా.. కొడుకు వేదాంత్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వేదాంత్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే లతారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు అయ్యింది.

మీశక్తిని వ్యర్థమైన మాటల్లో వృథా చేయక, మౌనంగా ధ్యానం చేయండి. మనశ్శక్తిని సమీకరించి ఆధ్యాత్మిక శక్తిజనకయంత్రంగా అవతరించండి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ ?

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు అనే సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పౌరసత్వం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్

**కాకినాడ, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ బీఎల్‌వోలకు స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం కాకినాడ నగరంలోని శాంతినగర్ ప్రాంతంలో ఉన్న 48వ పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటరు వివరాల ధృవీకరణ, నమోదు ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మరియు ఉన్నతాధికారులు జారీ చేస్తున్న మార్గదర్శకాలను బీఎల్‌వోలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేదా నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) కె.టి. సుధాకర్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) మరియు అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ గోవిందరాజులు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్ లో నూతన డయాలిసిస్ విభాగం ప్రారంభం

## నూతన మెషిన్స్‌ను మరియు నాలెడ్జ్ స్టూడియో విభాగాన్ని ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



**కాకినాడ, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ విభాగాన్ని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక వైద్య సేవలను అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంట్ సేవలు, అరుదైన వ్యాధులకు చికిత్సలు మరియు అత్యాధునిక వైద్య సదుపాయాలను తక్కువ ఖర్చుతో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా అత్యంత వేగంగా వైద్య సేవలను విస్తరిస్తున్న సంస్థగా మెడికవర్ హాస్పిటల్స్ గ్రూప్ ముందంజలో ఉందని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా ఆరోగ్య రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని కొనియాడారు. కాకినాడ జిల్లా ప్రజలకు డా. ఎన్టీఆర్ వైద్య సేవ మరియు ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు.నూతన డయాలిసిస్ విభాగం ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన చికిత్స అందుతుందని, మెరుగైన క్యాన్సర్ వైద్య సేవలు, గుండె సంబంధిత మరియు మెదడు మరియు వెన్నుముక సంబంధిత వైద్య సేవలు , అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండటం స్థానిక ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ల. అంజిబాబు మాట్లాడుతూ, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే మెడికవర్ హాస్పిటల్స్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన డయాలిసిస్ సేవలను అందించేందుకు నూతన డయాలిసిస్ విభాగాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. డా. ఎన్టీఆర్ వైద్య సేవ మరియు ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక వైద్య విభాగాలను ప్రారంభించి, కాకినాడ మరియు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు,బీజేపీ ప్రతినిది నాని ,మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశం

- –జులై 3,4,5 తేదీల్లో ఏలూరు వేదికగా రైతు మహాసభలు
- –వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరం
- –నష్టపోతున్న అన్ని పంటల రైతులను ఆదుకోవాలి
- – రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

**ఏలూరు, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర రైతుల ఉద్యమాలకు జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు దిశా నిర్దేశం చేయనున్నాయని, ఈ మహాసభ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఏలూరులోని అల్లూరు సత్యనారాయణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 3న మధ్యాహ్నం గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి హలో రైతన్న – చలో ఏలూరు పేరుతో రైతు మహా ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని, 4,5 తేదీల్లో డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే, జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్, రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి బాగాలేదని, ఏ పంటకు కనీస ధర రావడం లేదన్నారు. మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, మామిడికి తగిన ధర రాలేదని, పొగాకు రైతులకు పొగ పెడుతున్నారని విమర్శించారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, రో÷–లడెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వాలు కల్పించాయన్నారు. భారీగా పెంచిన ఆక్వా మేతల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వర్జీనియా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కోకో రైతులకు తగిన ధర రాలేదని, కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలన్నారు.ఆయిల్ పామ్ రైతులను ఆయిల్ రికవరీ శాతం పేరుతో కంపెనీల దోపిడీ ఆపాలన్నారు. అమెరికాతో భారత్ జులై మొదటి వారంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు ప్రకటించారని, ఈ ఒప్పందం వలన మన దేశ వ్యవసారంగం తీవ్రంగా దెబ్బతింటుందని, రైతులు నష్టపోతారని ఆందోళన చేశారు. పాలు,పాల పదార్థాలు ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అవుతాయని, పాడి పరిశ్రమ,పాడి రైతులు దివాళా తీస్తారని చెప్పారు. మొక్కజొన్న,సోయాబీన్,పత్తి ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయితే ఇప్పటికే నష్టపోతున్న ఆయా పంటల రైతులు మరింత నష్టపోతారని అన్నారు. అమెరికాతో స్వేచ్ఛా ఒప్పందాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో స్థితిగతులు చర్చించి భవిష్యత్ రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశర చేయనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ రైతు రక్షణ,వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంలో కీలకపాత్ర వహిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు.


# ఐపిఎస్ అధికారి సునీల్‌కు క్యాట్‌లో చుక్కెదురు

## సస్పెన్షన్ ఎత్తేయాలన్న పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ,జూన్ 30(ఆర్ఎన్ఎ):** ఏపీకి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో చుక్కెదురైంది. తనపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ కొట్టివేసింది. తీవ్ర అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కు మార్ నేడు సర్వీస్ నుంచి రిలీవ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈరోజైనా తనకు రిలీఫ్ ఇవ్వాలని సునీల్ కుమార్ క్యాట్‌ను కోరారు. మంగళవారం ఉదయం జరిగిన విచారణలో సునీల్ వాదనలు విన్న క్యాట్.. సస్పెన్షన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. సునీల్ కుమార్‌పై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, నేర విచారణలకు ఎలాంటి మినహాయింపులు లేవని, అవి కొనసాగుతాయని మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయనకు లభించాల్సిన పెన్షన్ ప్రయోజనాలు అఖిల భారత సర్వీసుల నియమాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు లోబడి ఉంటాయని పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్



మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు పక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు పక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు. రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ

సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఏపీలోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడపులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడపులులను ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

# దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

# పారిశ్రామిక రంగంలో ఎపి ఊహించని ప్రగతి

తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల గడిచిన రెండేళ్లలోనే ఏకంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే 24.3 శాతం వాటాను దక్కించుకొని దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని మంత్రి గర్వంగా ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని మంత్రి టీజీ భరత్ వివరించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 18 ఎస్ఐపీబీ సమావేశాల్లోనే దాదాపు రూ.11.77 లక్షల కోట్ల పెట్టుబడు లకు లైన్ క్లియర్ చేస్తూ అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర యువతకు పది లక్షల ముప్పై రెండు వేల (10.32 లక్షలు) కొత్త ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా 26 నూతన విధానాలను ప్రకటించగా, అందులో పరిశ్రమల శాఖే స్వయంగా 6 కీలక పాలసీలను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. క్వాంటం వ్యాలీ, ప్రతిష్టాత్మక స్టీల్ ఎ÷–లాంట్, స్పేస్, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీతో పాటు సర్కులర్ ఎకానమీ పాలసీలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ఎపి టాప్

కల్పించిన రాష్ట్రం. 2025–26 ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 95 శాతం సాధించింది. రుణాల పంపిణీతోపాటు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంలోనూ ముందంజలో ఉంది. వ్యాపార నిర్వహణ, ఫైనాన్షియల్–డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధిపై డ్వాక్రా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించచింది. అలాగే డిజిటల్ మానిటరింగ్, ఎంఐఎస్ వ్యవస్థ, ఫీల్డ్ తనిఖీలతో మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాల మంజూరు చేయించే అంశంపై కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వేగంగా రుణాలు మంజూరు చేసి మహిళలకు తోడ్పాటు అందించాయి బ్యాంకులు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండగా గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, కుటుంబ ఆదాయాల పెంపులో ఏపీ ఆదర్శంగా నిలిచింది. పేద, వెనుకబడిన వర్గాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో జాతీయ స్థాయిలో ఛాంపియన్ గా నిలిచింది ఆంధ్రప్రదేశ్.

# కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామరూపాలు లేకుండాపోయింది. మృతదేహాలు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.


## దక్షిణ రైల్వే

**ఈ-టెండర్ నోటీసు నెం. CW/WP/8150-WC/BVCM/SOLAR & EPOXY/100/OT, తేదీ: 26.06.2026**

బీవీసీఎం (BVCM) వ్యాగన్లలో పాలియామైన్ ఎపాక్సీ రెసిన్ ఫ్లోరింగ్ సరఫరా మరియు అమరిక / ఇన్‌స్టాలేషన్‌తో పాటు సౌర విద్యుత్ (సోలార్ ఎలక్ట్రికల్) వ్యవస్థ ఏర్పాటు.

| పని అంచనా విలువ | బిడ్ సెక్యూరిటీ (EMD) | ఒప్పంద కాలం | టెండర్ ముగింపు తేదీ & సమయం |
|---|---|---|---|
| ₹ 2,94,27,531.00 (GST @ 18%తో కలిపి) (అక్షరాలా: రెండు కోట్లు తొంభై నాలుగు లక్షల ఇరవై ఏడు వేల ఐదు వందల ముప్పై ఒక రూపాయలు మాత్రమే) | ₹ 5,88,600/- (అక్షరాలా: ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల ఆరు వందల రూపాయలు మాత్రమే) | 12 నెలలు | 22.07.2026 మధ్యాహ్నం 12:00 గంటలకు |

టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు మరియు పత్రాలు WWW.IREPS.GOV.IN లో అందుబాటులో ఉన్నాయి.

సహాయ వర్క్స్ మేనేజర్ / వ్యాగన్ ప్రొడక్షన్
సెంట్రల్ వర్క్‌షాప్ / గోల్డెన్ రాక్ / తిరుచ్చి – 620004

# వైసీపీ నేతల ఆందోళనలు రాజకీయ నాటకాలే

## - అధికార పార్టీ నేతలు

**కుప్పం,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మామిడి రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే తక్కువ ధర చెల్లిస్తున్న కంపెనీ ఎదుట ఆందోళన చేయాలని, ఎక్కువ ధర చెల్లిస్తున్న కంపెనీలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేయడం సరికాదని కుప్పం పట్టణానికి చెందిన టిడిపి నాయకులు ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, పి.కె.ఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబులు విమర్శించారు. కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం అధ్యక్షులు జి ఎం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు, పీకేఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పాల్గొని మాట్లాడారు. మామిడి ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల ఎదుట వైసీపీ నాయకులు చేపడుతున్న ఆందోళనలు రైతుల పట్ల ప్రేమతో చేస్తున్నవి కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న కపట నాటకాలని ఆరోపించారు. రైతులకు తక్కువ ధర చెల్లిస్తున్న సొంత పార్టీకి చెందిన కంపెనీపై ప్రశ్నలు లేవనెత్తకుండా, ఎక్కువ ధర చెల్లిస్తున్న ఇతర కంపెనీల వద్ద నిరసనలు చేపట్టడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ ఆర్ ఫుడ్స్ సంస్థ కిలో మామిడికి కేవలం మూడు రూపాయలు మాత్రమే చెల్లిస్తుండగా, జైన్ ఫామ్ ఫ్రెష్ ఫుడ్స్ సంస్థ కిలోకు ఆరు రూపాయలు చెల్లిస్తోందని తెలిపారు. ఈ ధరల వ్యత్యాసం వల్ల రైతులు నెలకు సుమారు పన్నెండు కోట్ల రూపాయల మేర నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ సెల్వరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యేం ద్ర శేఖర్, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్, మార్కె ట్ కమిటీ డైరెక్టర్లు,తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారి మరమ్మతుల కోసం దీక్ష

## - ప్రతి ఒక్కరూ తరలిరావాలని సిపిఐ పార్టీ పిలుపు

**పుంగనూర్ , జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోడ్డు అనేది ప్రతి ఒక్కరి కనీస అవసరం. ఆ రోడ్డు అధ్వానంగా మారి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నప్పుడు, దాని కోసం పోరాడటానికి అందరి మద్దతు ఎంతో అవసరం. పుంగనూరు నుండి బెంగళూరు వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడం వల్ల నిత్యం ప్రయాణికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇదే రహదారిపై ప్రమాదం జరిగి ఒక విద్యార్థి మృతి చెందిన ఘటన కూడా ఉంది.నెల రోజులుగా అర్ అండ్ బీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా నామమాత్రపు పనులతో కాలయాపన చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు.బుధవారం లోగా రోడ్డు పనులు పునఃప్రారంభించి, మరమ్మతులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాము. కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ ప్రజలు, వాహనదారులు మరియు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాము.

# 12వ వార్డులో ఓటరు ధ్రువీకరణ ప్రక్రియ పరిశీలన

**కుప్పం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం మున్సిపాలిటీ 11వ క్లస్టర్ పరిధిలోని 12వ వార్డులో మంగళవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ఓటరు ధ్రువీకరణ కార్యక్రమం నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి డీకేపల్లి మణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరణ చేపట్టారు. కార్యక్రమాన్ని స్థానిక క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్ పరిశీలించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అందరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రవి కార్యక్రమంలో పాల్గొని ఓటర్లతో మాట్లాడారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

# మామిడి రైతులను ఆదుకుంది టీడీపీ ప్రభుత్వమే

## - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సొంత ఫ్యాక్టరీలో రైతుల కడుపు కొడుతూ పక్క ఫ్యాక్టరీల దగ్గర వైసిపి నేతలు దొంగ నాటకాలు ఆడుతూన్నారని పలమనేరు శాసనసభ్యుల అమరనాథ్ రెడ్డి విమర్శించారు. పలమనేరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు మామిడి ఫ్యాక్టరీల ఎదుట వైసీపీ నేతలు చేస్తున్న ఓవరాక్షన్ చూస్తూంటే దొంగే దొంగా అన్నట్లు ఉందని రైతుల మీద వైకాపాకు ఉన్నది కపట ప్రేమ మాత్రమే అన్నారు. ఓవైపు రైతుల కష్టం దోచుకుంటూ సొంత పార్టీ నేతకు చెందిన కంపెనీలో కిలో మామిడికి కేవలం రూ. 3 రూపాయలు మాత్రమే ఇస్తుంటే , అదే రైతులకు మేలు చేస్తూ వో కంపెనీ కిలోకు రూ.6 రూపాయలు చెల్లిస్తున్నాయన్నారు. నెలకు ఏకంగా 12 కోట్ల మేర రైతులను నిలువునా దోచుకుంటున్న వైకాపా నేత కంపెనీని విస్మరించి ఎక్కువ ధర చెల్లిస్తున్న ఫ్యాక్టరీల వద్ద వైసీపీ నేతలు నాటకాలు ఆడుతున్నారన్నారు. దమ్ముంటే రైతులను మోసం చేస్తున్న సొంత నేత కంపెనీ ఎదుట వైకాపాన్నియతల ధర్నా చేయాలని ఇలాంటి చీప్ పొలిటికల్ డ్రామాలాడితే రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లో లేకపోలేదని హితవు పలికారు. మామిడి రైతులు అండగా నిలిచి వారిని ఆదుకున్న ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం అని కేజీకి అదనంగా రూ. 4 ప్రోత్సాహం అందించి, 261 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ఈ ఏడాది సైతం మామిడి రైతులను ఆదుకునేందుకు రూ. 4 చొప్పున అదనపు ప్రోత్సాహం ఇచ్చేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందని పేర్కొన్నారు. దాంతోపాటు రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతుల ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సైతం సీఎం కోరారని వివరించారు. ఇప్పటికైనా వైకాపా నేతలు ఆడుతున్న డ్రామాలు కట్టిపెట్టాలని లేకపోతే మామిడి రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

# మోకాలి తుంటి కీళ్లు మార్పిడి శాస్త్ర చికిత్స నిపుణులు

## - డాక్టర్ దినేష్ మనీ

**పలమనేరు,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగవరం,పలమనేరు,పట్టణంలో ఇప్పుడు బెంగళూరు మణిపాల్ హాస్పిటల్ వర్తుర్ రోడ్డు ఎముకల శాస్త్ర చికిత్స నిపుణుల ద్వారా ఓ పి డి సేవలు ప్రతి నెల మొదటి శుక్రవారం నిర్వహించబడును. ఇందులో మోకాలి, తుంటి కీళ్ళు మార్పిడి శాస్త్ర చికిత్స ఆర్థోస్కోపీ సర్జరీ, క్రీడా గాయాలు వెన్నుముక, నరముల సమస్య ఉన్నవారు. డాక్టర్ దినేష్ మనీ ని సంప్రదించవచ్చునన్నారు. ప్రతినెలా మొదటి శుక్రవారం అందుబాటులో ఉంటారు. 3-7-2026 సమయం: సాయంకాలం4:00 నుండి6:00 గంటల వరకు అందుబాటులో ఉంటారు. స్థలం సాయి హెల్త్ కేర్ మరియు డయాగ్నోసిస్ సాయి నగర్, మదనపల్లి రోడ్డు అపాయింట్మెంట్ కొరకు సంప్రదించండి: ఆర్. కిరణ్ 9986456234, ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మునిరత్నం, సురేష్ బాబు



**కుప్పం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన విజయవంతం అయ్యేలా చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రూ. 117.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి పాల్గొననున్న బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను పరిశీలించి, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా బాబు దోబీఘాట్ ప్రాంతంలో చేపట్టిన ఏర్పాట్లను కూడా పరిశీలించి, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, తాగునీరు, భద్రత, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు, పార్టీ నాయకులకు తగిన సూచనలు చేశారు. పర్యటన సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన కుప్పం అభివృద్ధికి మరింత ఊతమివ్వనున్న నేపథ్యంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

# పాడి రైతుకు బాబు భరోసా- సగం ధరకే పసుధానా పంపిణీ

**రామకుప్పం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని 90 బంధార్లపల్లి మరియు పందాలమడుగు పంచాయతీలలో పాడి రైతులకు సబ్సిడీపై పశుదాన మరియు మొక్కజొన్న విత్తనాలను మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు మరియు అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రేకుల సంక్షేమానికి అందిస్తున్న ప్రోత్సాహంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు 1100 విలువ చేసే 50 కిలోల పశుధాన బస్తాను 50 శాతం రాయితీతో కేవలం 550 కి రైతులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు, పాడి రైతులను అన్ని విధాల ఆదుకునే కార్యక్రమాన్ని చేపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు కూటమి ప్రభుత్వానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు, పశువుల దాన ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీ రైతులకు ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు గౌడ్, బంధార్లపల్లి పార్టీ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, పంద్యాలమడుగు పార్టీ అధ్యక్షుడు రమణ, ముఖ్య నేత చంద్రారెడ్డి,మాజీ సర్పంచ్ పెరుమాళ్, మాజీ, ఐటీడీపి మండలాధ్యక్షుడు భాస్కర్, ఆనంద గౌడ్, రవి, పార్థసారథి,రమేష్ రెడ్డి, బాలు, రఘునాథ్ రెడ్డి ,మురళీమోహన్ రెడ్డి, అనంతప్ప, వెటర్నరీ అసిస్టెంట్ మంజునాథ్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేటినుండి కాయల నమోదు ప్రక్రియ ప్రారంభం

## - ఉద్యాన శాఖ అధికారి పల్లవి

**రామకుప్పం ,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం మండలం తోతాపురి మామిడి రైతులకు ఉద్యానవన శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. కోత కోసిన తోతాపురి కాయలను విక్రయించేందుకు రైతుల పేర్ల నమోదు ప్రక్రియ నేడు మధ్యాహ్నం 2 గంటల నుండి ప్రారంభమవుతుందని హార్టికల్చర్ అధికారి పల్లవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.రాజుపేట రోడ్డులోని శివుని కుప్పం మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అధికారులు నమోదు చేసుకుంటారనీ. రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, 1బీ, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, కాటా స్లిప్ తీసుకురావాలని సూచించారు.ప్రతిరోజు ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 7:00 గంటల వరకు మార్కెట్ యార్డుకు వచ్చే కాయలను మాత్రమే నమోదు చేస్తారనీ ఆమె పేర్కొన్నారు.ఏ రోజు కోత ఆ రోజే రైతులు ఏ రోజు కోత కోసిన కాయలను ఆ రోజు మాత్రమే నమోదు చేయించుకునే అవకాశం ఉంటుందనీ ముందు రోజు కోసిన కాయలను నమోదు చేయరన్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారికి ప్రత్యేక సూచన ఇతర రాష్ట్రాలకు తోతాపురి కాయలు పంపించే రైతులు క్రింది మూడు వెయింగ్ బ్రిడ్జిల వద్ద మాత్రమే కాటావేయించుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. తోతాపురి మామిడికాయలు పండించిన రైతులు కుప్పం పట్టణంలోని తాజ్ వెయింగ్ బ్రిడ్జ్ శాంతీపురం మండలం బడుమాకులపల్లి వద్ద గల కింగ్స్ వెయింగ్ బ్రిడ్జ్ రాజపేట వద్ద గల555 వెయింగ్ బ్రిడ్జ్ఈ బ్రిడ్జిల వద్ద కాటా వేయించుకున్న తర్వాత అక్కడే ఉన్న అధికారుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.రైతులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పూర్తి పత్రాలతో రావాలని, నిబంధనలు తప్పక పాటించాలని హార్టికల్చర్ ఆఫీసర్, కుప్పం కోరారుమరిన్ని వివరాలకు ఫోన్: 7731881596 సంప్రదించాలని ఆమె కోరారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**కుప్పం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం మున్సిపాలిటీ పదో క్లస్టర్ పరిధిలోని ఇరవయ్యో వార్డులో గల బూత్ నంబర్లు 166, 167లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులతో కలిసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి, కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తున్న తీరును సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఖచ్చితంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, కొత్తగా అర్హత పొందిన వారి పేర్లను నమోదు చేయడంతో పాటు, వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకుండా అధికారులు, బూత్ స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సవరణ ప్రక్రియలో ప్రజలు కూడా చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్. సోమశేఖర్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకిర్, బూత్ ఇన్‌చార్జి లోకేష్, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో భాస్కర్ పదవీ విరమణ



**పలమనేరు ,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని శనీశ్వరుని ఆలయం వద్ద ఉన్నధ్యాన పిరమిడ్ మందిరంలో మంగళవారం పలమనేరు ఎంపీడీవో భాస్కర్ పదవీ విరమణ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వక్తలు మాట్లాడుతూ... అటెండర్ స్థాయి నుండి తాను ఎంపీడీవో స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా తెలియజేశారు. తాను ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఆయన ఎంపీడీవో గా ఉన్న సమయంలో ఎంతోమందికి సహాయ సహకారాలు అందించానన్నారు. అదేవిధంగా ఆయన చేసిన సేవలను వచ్చిన వక్తలు కొనియాడారు. వివిధ హోదాలలో పనిచేస్తున్న ఉద్యోగులు వచ్చి ఎంపీడీవో భాస్కర్ కు పూలహారం వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పిరమిడ్ ధ్యానంలో పనిచేస్తున్న వారందరూ వచ్చి ఆయనను సన్మానించారు. అనంతరం పదవి విరమణ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ఆయన విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. వి సుభాష్ చంద్రబోస్, తాసిల్దార్ ఇన్బనాదం, ఎంఈఓ లీలారాణి, రిటైర్డ్ ఎంఈఓ 2 బాల సుందరం, ఎంపీడీవో బాలాజీ, జడ్పిటిసి రంగనాథం మల్లిక, సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, ఏవో సంధ్య, ఉమాపతి నాయుడు, రవీంద్రనాథ్ శెట్టి, వీఆర్వో కృష్ణ, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ నిర్మాణ కమిటీల్లో నిబద్ధత కలిగిన కార్యకర్తలకు ప్రాధాన్యం

## - సీరివేలు గంగాధర్ (చిన్నా)




**పుంగనూరు,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సీరివేలు గంగాధర్ (చిన్నా) మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమావేశానికి విచ్చేసిన మీడియా ప్రతినిధులకు జనసేన పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టంగా నిర్మించాలనే లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పార్టీ నిర్మాణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలో పార్టీ నిర్మాణ కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కె.కె. ని అబ్జర్వర్‌గా నియమించినట్లు వెల్లడించారు.రాజంపేట పార్లమెంట్ పరిధిలో మొత్తం 27 మంది నిర్మాణ సారథులతో పాటు ఐటీ విభాగం నుంచి మరో ఇద్దరిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఉద్యమకారులు, సాధకులు, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న కార్యకర్తలు, వీర మహిళలకు ఈ కమిటీల్లో సముచిత స్థానం కల్పించేలా పార్టీ అధిష్ఠానం ప్రత్యేక అవకాశం కల్పించిందన్నారు.గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిలలో నాలుగు రకాల కమిటీలకు సంబంధించిన దరఖాస్తులు రాజంపేట పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పార్టీ కార్యాలయానికి వచ్చి సంబంధిత దరఖాస్తును పూర్తి చేయాలని సూచించారు.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరిశీలన కమిటీలు దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అబ్జర్వర్ శ్రీ కె.కె. ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించడం జరుగుతుందని, తుది నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్వయంగా తీసుకుంటారని పేర్కొన్నారు.పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఉద్యమకారుడు, సాధకుడు, వీర మహిళ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభించేలా జనసేన పార్టీ పారదర్శక విధానంలో కమిటీలను ఏర్పాటు చేస్తుందని సీరివేలు గంగాధర్ (చిన్నా) స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ సేవలు అనిర్వచనీయం

## - జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ ప్రశంస



**చిత్తూరు, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా గిరిజన సంక్షేమం, పౌరసరఫరాలు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖలకు మీరు అందించిన సేవలు అనిర్వచనీయమని జిల్లా రెవిన్యూ అధికారి మోహన్ కుమార్ ప్రసంశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎస్ మూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఈ. శంకరన్, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఆర్ఓ మోహన్ కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఆయా విభాగాలకు అత్యుత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ చేస్తున్న ముగ్గురు అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ముగ్గురు అధికారులు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయా శాఖల్లో పనితీరు మెరుగుపడడం, ఉత్తమ ఫలితాలు రావడం వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనమన్నారు. జిల్లా కలెక్టర్ సైతం అధికారులు మూర్తి, శంకరన్, పద్మమ్మ సేవలను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం అందించడం గొప్ప విషయంగా అభివర్ణించారు. చిత్తూరు జిల్లా స్థాయి ప్రభుత్వ ఉన్నతాధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపట్ల వెంకటరమణ మాట్లాడుతూ .... గిరిజన సంక్షేమాధికారి మూర్తి తమ పరిధిలోని గిరిజనులు, గిరిజన సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విశేషంగా కృషి చేశారని కొనియాడారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శంకరన్ జిల్లాలో అవినీతి, అక్రమాలకు చోటివ్వకుండా లబ్ధిదారులకు రేషన్ అందించడం, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరించడం హర్షనీయమన్నారు. అదే విధంగా జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ అవిరామంగా కృషిచేసి సఫలీకృతులయ్యారని కొనియాడారు. ఉద్యోగ విరమణ చేస్తున్న అనంతరం విధి నిర్వహణలో తమకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి ఉద్యోగ విరమణ చేస్తున్న మూర్తి, శంకరన్, పద్మమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న ముగ్గురు అధికారులను డిఆర్ఓతో పాటు, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది దుస్సాలువలతో ఘనంగా సన్మానించారు. కాగా ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంకేతిక ఆవిష్కరణలకు యువత ముందుకు రావాలి

## - అపోలోలో 'శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో-2026'పై అవగాహన




**చిత్తూరు, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందించే వినూత్న ఆలోచనలతో యువత ముందుకు రావాలని లైఫ్ కోచ్, ప్రేరణాత్మక వక్త ఎం.డి.ఎన్. ఈశ్వర్ సూచించారు. ది అపోలో యూనివర్సిటీలోని అపోలో కెరీర్ కౌన్సెలింగ్ సెల్ (ఏసీసీసీ) ఆధ్వర్యంలో మంగళవారం లి'శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో--2026'లిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి 200 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.ఈశ్వర్ మాట్లాడుతూ సమాజ అవసరాలను గుర్తించి వినూత్న ఆలోచనలను సాంకేతిక పరిష్కారాలుగా మలచాలని సూచించారు. పోటీ లక్ష్యాలు, అర్హతలు, దరఖాస్తు విధానం, సమస్యల గుర్తింపు, ఆలోచనలను ప్రాజెక్టులుగా రూపుదిద్దే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజ అవసరాలకు అనుగుణంగా రూపొందే ఆవిష్కరణలే దేశాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలు, ఆరోగ్యం-విద్య, క్రీడలు-సాంకేతికత, పర్యావరణ సుస్థిరత అనే నాలుగు విభాగాల్లో ఆవిష్కరణలను సమర్పించవచ్చని తెలిపారు. 22 ఏళ్లలోపు బీటెక్, ఎంబీబీఎస్, బీఎస్సీ, ఎమ్మెస్సీ విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా ముగ్గురు సభ్యులతో కూడిన బృందాలుగా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. విజేతలకు రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్రోటోటైప్ నిధులతో పాటు రూ.2 కోట్ల ఇంక్యుబేషన్ గ్రాంట్, ఇతర నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వైస్ చాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్. మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశోధన విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి. హిమ బిందు, ఐసీటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సి. పక్కిరయ్య, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ డాక్టర్ బి. నాగేశ్వరరావు,శిక్షణ--ప్లేస్‌మెంట్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్, అపోలో కెరీర్ కౌన్సెలింగ్ సెల్ (ఏసీసీసీ) చైర్‌పర్సన్ డి. గోపీ భూషణ్ పాల్గొన్నారు.

# రాయచోటి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోదాము తనిఖీ

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**మదనపల్లె/రాయచోటి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24-7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మాసవారీ తనిఖీల్లో భాగంగా.... రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ లో అంతర్భాగాలను రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ ఏ. శ్రీనివాస్, తాసిల్దార్ యామిని, ఎలక్షన్ విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన

**- 29 వ వార్డ్ టిడిపి అధ్యక్షులు జాన్ బాబు**

**మదనపల్లె, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో ఎస్ఐఆర్‌పై 29 వ వార్డు టిడిపి ఐటీడీపీ అధ్యక్షులు బోనాసి జాన్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.మంగళవారం గజ్జలకుంట 131వ పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఓతో కలిసి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బోనాసి జాన్ బాబు,వార్డు ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరణ ఇచ్చి అవసరమైన సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో నమోదు చేసుకుని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సౌత్ జోన్ అండర్-16 జయప్రకాశ్ బౌలింగ్ మెరుపు

**- కడప 279 పరుగులకే పరిమితం**



**వాల్మీకిపురం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ జోన్ అండర్ - 16 మల్టీ డేస్ మ్యాచుల్లో వాయల్పాడు సి డి సి ఎ - జి వి ఎస్ సి ఎస్ (గ్రౌండ్స్) లో గ్రౌండ్ 1 లో చిత్తూరు మరియు కడప జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ లో లిచిత్తూరు జిల్లా రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అయిన జయప్రకాశ్ ( 93 పరుగులకు 5 వికెట్లు తీసుకోవడంతో ) విజృంభించడంతోలి , తేజేష్ , దినేష్ ఇద్దరూ రెండేసి వికెట్లు తీసుకోవడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లికడప జట్టు 71 . 5 ఓవర్లలో 279 పరుగులు మాత్రమే చేయగలిగింది. కె. లోకేష్ 145 బంతుల్లో 67 పరుగులు, ఎస్. కె. ఉమర్ సిద్దిక్ 49 బంతుల్లో 59 పరుగులు, పి. హితేష్ సాయి 96 బంతుల్లో 65 పరుగులు ( నాట్ ఔట్ ) చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 18 ఓవర్లలో 43 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది. దినేష్ 9 బంతుల్లో 3 పరుగులు, తేజస్ 4 బంతుల్లో పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. కడప బౌలర్లలో ఎమ్. వర్షిత్ కుమార్ 18 పరుగులకు 2 వికెట్లు, బి. ముని జ్ఞానేశ్వర్, సి ఎండీ ఫైజాన్ ఒక్కొక్కరు ఒక్కో వికెట్ తీసుకున్నారు అని సి డి సి ఎ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా హెడ్ కోచ్ సునీల్ కుమార్ పర్యవేక్షణ చేస్తున్నారు.

# రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ

**- అభినందనలు తెలిపిన సీనియర్ సిటిజన్లు**



**మదనపల్లె, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి ఎన్నికలు జూన్ 30 అనగా మంగళవారం ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమలలో రాష్ట్ర ఎన్నికల అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగాయి. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాకు అధ్యక్షుడైన డాక్టర్ నైనారి మునిగోపాలకృష్ణను ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకొ న్నారు. ఈ శుభసందర్భంలో రాష్ట్రపెద్దలు నారాయణమూర్తి, పరమేశ్వర్ రెడ్డి,రామచంద్ర రావు,వీరా రావు,మోతుకూరు వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, సాగర్, సీనియర్ సిటిజన్లు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ముని గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల అధికారికి,రాష్ట్ర నాయకులకు తనను రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. గతంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించానని, ప్రస్తుతం ఆర్గనైజింగ్ సెక్రటరీగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని,సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి,వారి సమస్యల పరిష్కారానికి అలుపెరగని కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# గంజాయి, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం.. సీఐ హెచ్చరిక

**రామసముద్రం , జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం పోలీస్ స్టేషన్‌ను మదనపల్లి రూరల్ సీఐ రవి నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని జనరల్ డైరీ, కేసుల రికార్డులు, పెండింగ్ దర్యాప్తు ఫైళ్లు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలాంటి జాప్యం లేకుండా స్వీకరించి చట్టపరిధిలో తక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సీఐ రవి నాయక్ ఆదేశించారు.

# ఎల్‌నినో సవాళ్లకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారం

**- జిల్లాలో ఆరుతడి పంటల సాగును విస్తరించాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె/చిన్నమండెం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు అందించే ప్రకృతి వ్యవసాయ విధానాలను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు రైతులలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం చిన్నమండెం మండలం కేశాపురం గ్రామంలో పీఎండీఎస్, విత్తన పెల్లెటైజేషన్ విధానాలపై నిర్వహించిన క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను కలెక్టరు పరిశీలించారు. ముందుగా రైతు ఖదర్ నిషా అమలు చేస్తున్న పీఎండీఎస్ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్.. పంటల పరిస్థితిని పరిశీలించారు.తక్కువ నీటితోనూ మెరుగైన దిగుబడులు సాధించేందుకు ఈ విధానం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు వివరించారు.అనంతరం విత్తన పెల్లెటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్‌నినో దృష్టిలో ఉంచుకుని ప్రకృతి వ్యవసాయం, ఆరుతడి పంటల సాగు, జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, పెసలు, మినుములు, కందులు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని తెలిపారు..ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి. వెంకట మోహన్, ఎఫ్ఎంటి సిద్దయ్య, పద్మావతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు, పీఎండీఎస్, విత్తన పెల్లెటైజేషన్ విధానాలు, రైతులకు అందిస్తున్న సాంకేతిక సేవలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

# మార్పూరి సుధాకర్ నాయుడు త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలి

**- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఆకాంక్ష**



**మదనపల్లె, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త,సీనియర్ నాయకులు మార్పురి సుధాకర్ నాయుడు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.ఈ నేపథ్యంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,టీడీపీ సీనియర్ నాయకులు సీడ్స్ మల్లికార్జున నాయుడులు సుధాకర్ నాయుడు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇందులో భాగంగా వారు సుధాకర్ నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి సుధాకర్ నాయుడు చేసిన విశేష సేవలను గుర్తు చేశారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ ల వద్ద ఆయనకంటూ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నారని కొనియాడారు. అదేవిధంగా కార్యకర్తల సంక్షేమానికి సుధాకర్ నాయుడు తన వంతు సహాయ,సహకారాలు ఎల్లవేళలా అందిస్తున్నారని తెలిపారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి మళ్ళీ రావాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శలో పలువురు స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు జన్మదిన వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన నాగప్రసాద్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు**



**మదనపల్లె, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్, కోడూరు అబ్జర్వర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు (గుట్టబాబు) జన్మదిన వేడుకలు ఘనంగా మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఇర్రి నాగప్రసాద్ నాయుడు, జి.చంద్రశేఖర్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు.ఈ సందర్భంగా శివప్రసాద్ నాయుడు అభిమానులు, పార్టీ నాయకులు, పాల ఏకరి కులస్తుల మధ్య కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఇర్రి నాగప్రసాద్ నాయుడు, జి.చంద్రశేఖర్ నాయుడు ఆయనకు పుష్పగుచ్చం అందజేసి, శాలువ కప్పి, గజమాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గుట్టబాబు మాట్లాడుతూ... అందరి మధ్య ఇలాంటి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజ సేవకు, పార్టీ బలోపేతానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరై తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార సమితి పాల ఏకరి మండల అధ్యక్షులు మురుగు నాగేశ్వర నాయుడు (గాలివీడు, చక్రాయపేట, సదుం), గోళ్ళ వీరభద్రప్ప నాయుడు, గురికాని విశ్వనాథ నాయుడు, సదం బాలు నాయుడు, గోళ్ళ రెడ్డప్ప నాయుడు, వేణుగోపాల్ నాయుడు, మద్దె నరసింహ నాయుడు, వేడుక చలపతి, కునాసి హరిప్రసాద్ మణి నాయుడు సంతోష్ కుమార్, సురేంద్ర ,తదితరులు పాల్గొని గుట్టబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# వెలుగులో పసుపులేటి శశి కుమార్ జన్మదిన వేడుకలు

**- దివ్యాంగ చిన్నారులు,వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన పసుపులేటి చలపతి**



**మదనపల్లె, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెలుగు సంస్థ నందు కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి,పసుపులేటి పార్వతమ్మల కుమారుడు చార్టెడ్ అకౌంటెట్,యువ నాయకుడు పసుపులేటి శశికుమార్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.ముందుగా పసుపులేటి చలపతి దివ్యాంగులను మరియు వృద్దులను ప్రేమతో పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.ఇందులో భాగంగా కుమారుడు శికుమార్ పుట్టినరోజు వేడుక సందర్భంగా కేక్ కేట్ చేసి పిల్లలు,వృద్దులకు కేక్ మరియు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ నా కుమారుని పుట్టినరోజు వేడుకను వెలుగు సంస్థలో దివ్యాంగుల,వృద్ధుల మధ్య జరుపుకోవడం మ సంతోషంగా ఉందన్నారు.వెలుగు సెక్రటరీ యం, ఉదయ మోహన్ రెడ్డి,కన్వీనర్ భాగ్యలక్ష్మిలు దివ్యాంగులైన చిన్నారులు,వృద్ధులకు అందిస్తున్న సేవలు అమోఘమని,వెలుగు సిబ్బంది సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.భవిష్యత్తులో వెలుగు సంస్థకు తనవంతు సహాయ,సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు.అనంతరం వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ శికుమార్ పుట్టినరోజు వేడుకను మా వెలుగు సంస్థలో జరుపుకున్నందుకు మాజీ సర్పంచ్ చలపతికి,వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసి శాలువతో సత్కరించి మెమొంటోను అందజేశారు.చార్టెడ్ అకౌంట్ గా బెంగళూరులో స్థిరపడి,సేవా కార్యక్రమాలను శశి కుమార్ తనదైన పాత్ర పోషిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తూ తండ్రికి తగ్గ తనయుడుగా పేరు సంపాదించుకున్నాడని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సాయి శేఖర్ రెడ్డి,కనుగొండ,మురళి మోహన్ నాయుడు,బీవైఎస్ పునీత్,మాజీ ఉపసర్పంచ్ నాగరాజు,చిప్పిలి వెంకటేష్,సద్దల హరి,చిరు,వెలుగు ప్రిన్సిపాల్ లీనా కుమారి,సోషల్ వర్కర్ గీత,వెలుగు చిన్నారులు,వృద్దులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

# విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పరిచయం చేసిన కేవీకే శాస్త్రవేత్తలు

**కలికిరి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్-2026' కార్యక్రమంలో భాగంగా కలికిరి ఇందిరమ్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (టి. చదివేవాండ్లపల్లి) 9వ తరగతి విద్యార్థులు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ మరియు హెడ్ డాక్టర్ కె. మంజుల విద్యార్థులకు కేంద్రం ద్వారా రైతులు, మహిళలు, గ్రామీణ యువతకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, సేంద్రీయ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.వానపాముల ఎరువు తయారీ విధానం, అందులో ఉండే స్థూల, సూక్ష్మ పోషకాలు, వివిధ పంటల్లో వాటి వినియోగం గురించి ఆమె వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో వరి సాగులో పశువుల ఎరువు, అజోస్పిరిల్లం, పీఎస్‌బీ, కేఎస్‌బీ వంటి జీవన ఎరువులను వినియోగించి నాణ్యమైన దిగుబడులు సాధించినట్లు తెలిపారు. ఈ సేంద్రియ సాగు విధానాలను జిల్లాలోని రైతులు అనుసరించి లాభాలు పొందేలా కెవికే శాస్త్రవేత్తలు వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా మార్గదర్శనం చేస్తున్నట్లు చెప్పారు.అనంతరం శాస్త్రవేత్తలు వర్మీ కంపోస్ట్ యూనిట్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్, షేడ్ నెట్, అజోల్లా యూనిట్, కస్టమ్ హైరింగ్ సెంటర్, సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీలను విద్యార్థులకు చూపించి వాటి ఉపయోగాలను వివరించారు.గైడ్ టీచర్ జానం సుజాత మాట్లాడుతూ, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వనరుల సంరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్టులు డాక్టర్ కె. మాధురి, డాక్టర్ వై. పీరుసాహెబ్, ఎస్. సోమశేఖర్ బాబు, సి. శరత్ కుమార్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ రమణతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# కురబలకోట రైల్వే స్టేషన్ వద్ద మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు క్షేత్రస్థాయి పరిశీలన

**- అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై - ప్రభుత్వానికి నివేదిక**

**- జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ**



**మదనపల్లె/కురబలకోట, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో రవాణా, నిల్వ, వ్యవసాయ ఉత్పత్తుల నిర్వహణకు అనుకూలంగా కురబలకోట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ (ఎంఎంఎల్పీ) ఏర్పాటు అవకాశాలపై సంబంధిత అధికారులు, రైల్వే శాఖ అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.మదనపల్లె ప్రాంతానికి అనుకూలంగా లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు గతంలో వివిధ ప్రాంతాలను పరిశీలించినప్పటికీ, ప్రస్తుతం కురబలకోట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతం అందుబాటులో ఉన్న భూమి, రవాణా సౌకర్యాలు, రైల్వే అనుసంధానం పరంగా అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జేసి తెలిపారు. స్థల అవసరం, విస్తీర్ణం, రైల్వే అనుసంధానం, భూసేకరణ అవసరాలపై సంబంధిత శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆమోదం అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ పరిశీలనలో కురబలకోట తాసిల్దారు ధనుంజయలు, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్,వ్యవసాయ శాఖ,రెవెన్యూ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన మిట్స్ వర్సిటీ ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ క్యాడెట్లు

**- అభినందించిన యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ యెన్.విజయ భాస్కర్ చౌదరి**



**మదనపల్లె/ కురబలకోట, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన 15 మంది ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ క్యాడెట్లు జాతీయ స్థాయిలో నిర్వహించిన కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ లో విశేష ప్రతిభ కనబరిచారని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ లో నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ అటాచ్‌మెంట్ శిక్షణా శిబిరంలో 0.22 రైఫిల్ ఫైరింగ్, స్కిట్ ప్రదర్శన, డ్రిల్, ఏరోమోడలింగ్ డిజైన్, పారాచూట్ శిక్షణ, డ్రోన్ పైలటింగ్ వంటి వివిధ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. కాగా దేశంలోని పలు ప్రాంతాల నుంచి పాల్గొన్న క్యాడెట్లతో పోటీపడుతూ శారీరక శిక్షణతో పాటు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వాదోపవాదం వంటి మేధోపరమైన పోటీల్లో మిట్స్ క్యాడెట్లు తమ ప్రతిభను చాటుతూ మొత్తం ఏడు పతకాలు సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు గ్రూప్ కెప్టెన్ ఆర్.జె. అత్రే, కమాండింగ్ ఆఫీసర్, 11(ఆ) ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ, తిరుపతి వారు సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన క్యాడెట్లను మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ యెన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రో- ఛాన్సలర్ యెన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, ఎన్.సి.సి ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## భూ వివాదంలో మహిళపై దాడి : పోలీసులు కేసు నమోదు

**- దుబ్బిగానిపల్లిలో తీవ్రమైన భూ వివాదాలు**



**మదనపల్లె, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బలహీనులైన మహిళలపైన భూ కబ్జా దారులు దాడికి తెగబడిన ఘటన మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లి వద్ద చోటు చేసుకుంది. భూముల ధరలు పెరగడంతో కబ్జా దారులు దాడులు, దౌర్జన్యాలకు తిరగబడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. మదనపల్లె తాలూకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం లక్ష్మీదేవి, అలివేలమ్మ లపై చలపతి, మల్లికార్జున, వేణు, లోకేష్ దాడి చేసి గాయ పరచడం జరిగింది. వారసత్వంగా వచ్చిన భూములకు సంబంధించి భాగ పరిష్కారం కాకపోవడంతో అక్కచెల్లెళ్ళు అయిన అలివేలమ్మ, లక్ష్మీదేవి కి నాగరాజు మధ్య గత కొంత కాలంగా కోర్టు 55 సెంట్ల భూమికి సంబంధించి వివాదం జరుగుతున్న సమయంలో నాగరాజు ఒకటిముక్కల్ సెంటు భూమిని జి.రామకృష్ణ, జి.గోపాల్ లకు విక్రయించడం జరిగింది. ఈ భూమి ప్రస్తుతం కోర్ట్ కేసులో వుంది. కోర్టు కేసులో ఉన్న భూమిని కొనుగోలు చేసిన జి.రామకృష్ణ, జి.గోపాల్ తరుపున చలపతి మల్లికార్జున, వేణు, లోకేష్ రంగంలోకి దిగి కంచె ఏర్పాటుకు ప్రయత్నం చేశారు. దీనిని లక్ష్మీదేవి, అలివేలమ్మ అడ్డుకోవడం జరిగింది. చలపతి మల్లికార్జున, వేణు, లోకేష్ మహిళలపై దాడి చేసి గాయపరచడం జరిగింది. దాడి జరిగిన వెంటానే స్థానికులు లక్ష్మీదేవి, అలివేలమ్మ లను హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి మదనపల్లె తాలూకా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదే అదునుగా దుబ్బిగానిపల్లిలో సోమవారం జి.వెంకటరమణ, జి.వెంకటరత్నం కు వున్న 78 సెంట్ల స్థలంలో చుట్టూ ఉన్న రాతి కూసాల ప్రహరీని కె.రాజగోపాల్, కె.బాలగంగాధర్, జి.హరినాద్, సివి.అరవింద్, చలపతి, జి.రామకృష్ణ, జె. మల్లికార్జున, కె.చరణ్, డి.రెడ్డి నవదీప్ కూల్చి వేశారు. వీరిపై కేసు నమోదు చేశారు. ఇందులో కూడా భాగ పరిష్కారాలు కాకపోవడంతో ఇరు వైపులా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మదనపల్లె రూరల్ మండలం దుబ్బిగానిపల్లి ప్రాంతంలో భూములకు సంబంధించి ధరలు పెరగడంతో తరచుగా ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

# ఐడీబీఐ బ్యాంకు ఖాతా నుండి రూ. 97 వేల మాయం

## : వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**విజయవాడ , జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బ్యాంకు ఖాతాల నుండి సైబర్ నేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు కాజేస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా డింపుల్ జైన్ అనే మహిళకు చెందిన ఐడీబీఐ (IDBI) బ్యాంకు ఖాతా నుండి గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా రూ. 97 వేల నగదును బదిలీ చేసుకున్నారు.బాధితురాలి కథనం ప్రకారం.. ఈ నెల 6వ తేదీ నుండి 11వ తేదీల మధ్య కాలంలో ఆమె ఖాతా నుండి మూడు విడతలుగా అనుమానాస్పద లావాదేవీలు జరిగాయి. తన ప్రమేయం లేకుండానే ఖాతాలో ఉన్న సొమ్ము విత్‌డ్రా అయినట్లు గమనించిన బాధితురాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.దీనిపై ఆమె వెంటనే స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో ఈ అక్రమ లావాదేవీలు ఎక్కడి నుండి జరిగాయి, నిందితులు ఎవరు అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. బ్యాంక్ ఖాతాదారులు తమ ఓటీపీలు, పిన్ నంబర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఇబ్రహీంపట్నంలో టీ ధరల మోత.. హాఫ్ టీ రూ.10..!



**నందిగామ జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇబ్రహీంపట్నం పట్టణంలోని కొన్ని టీ స్టాళ్లలో హాఫ్ టీకి రూ.10 వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరల భారంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు టీ ధరల పెరుగుదల మరింత భారం అవుతోందని అంటున్నారు. ముఖ్యంగా హాఫ్ టీకి కూడా అధిక ధరలు వసూలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే టీ స్టాళ్లలో ధరల వివరాలను తెలిపే రేటు బోర్డులు లేకపోవడంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. టీ, కాఫీ తదితర వస్తువులకు ఎంత ధర వసూలు చేస్తున్నారో ముందస్తుగా తెలియకపోవడంతో కష్టమర్లు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా ప్రతి దుకాణంలో రేటు బోర్డులు ప్రదర్శించడం తప్పనిసరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. టీ ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రేటు బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పి.కొట్టం విద్యార్థినికి 'షైనింగ్ స్టార్' సత్కారం



**కోటనందూరు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎల్.డి.పేట గ్రామానికి చెందిన కూనిశెట్టి యమునకు అరుదైన గుర్తింపు దక్కింది. తాడేపల్లిలో 'షైనింగ్ స్టార్స్' పేరుతో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రూ.30 వేలు, పతకం, ధ్రువీకరణ పత్రం ఆమె అందుకుందని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. పి.కొట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఈమె పదో తరగతిలో 577 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 'షైనింగ్ స్టార్'గా ఎంపికైంది. తల్లిదండ్రులు కూనిశెట్టి జయమణి, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్, నాయకులు షేక్ నవాబ్ జానీ తదితరులు యమున అభినందించారు. ఏఐ విభాగంలో సాఫ్ట్‌వేర్ కొలువు సాధించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.

# అమరాపురం మండలంలో మెగా జాబ్ మేళా



**మడకశిర జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అమరాపురం మండలం లోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు పలువురు నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు 10 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సెలెక్ట్ అయిన యువతీ యువకులకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# రెవెన్యూ కార్యాలయం నీ ముట్టడించిన రైతులు



**కళ్యాణదుర్గం జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కుందుర్పి ఎత్తిపోతల పథకం (జీడిపల్లి, బీటీపీ) కోసం 2018లో తమ 1400 ఎకరాల భూములను ఇచ్చిన భూ నిర్వాసితులు మంగళవారం కుందుర్పి రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎనిమిదేళ్లు గడిచినా ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించలేదని, సాగు భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వెంటనే న్యాయం చేసి నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

# చెల్లిని కాపాడి.. కాలువలో కొట్టుకుపోయిన అన్న: విజయవాడలో విషాదం



**విజయవాడ , జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ ఫకీర్ గూడెం ప్రాంతంలో ఒక అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానిక బందరు కాలువ వద్ద ఆడుకుంటున్న ఒక చిన్నారి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. ప్రాణాపాయంలో ఉన్న చెల్లిని చూసి చలించిపోయిన అన్న షబ్బీర్, ఆమెను కాపాడేందుకు ఏమాత్రం ఆలోచించకుండా కాలువలోకి దూకాడు.తీవ్రంగా శ్రమించి, చెల్లిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంలో షబ్బీర్ సఫలమయ్యాడు. అయితే, కాలువలో ప్రవాహం బలంగా ఉండటంతో అతడు ఒడ్డుకు రాలేకపోయాడు. చూస్తుండగానే నీటి ఉధృతికి షబ్బీర్ ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు.స్థానికులు, రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ, అప్పటికే షబ్బీర్ మృతి చెందాడు. కళ్లెదుటే అన్న ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో ఆక్రందనలు మిన్నంటాయి. చెల్లి ప్రాణాలు కాపాడి, తను అనంతలోకాలకు వెళ్లిన షబ్బీర్ ఉదంతం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అడవిరావులపాడు జగన్ అన్న కాలనీలో దోమల దండయాత్ర...!



**నందిగామ జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అడవిరావులపాడు గ్రామంలోని జగన్ అన్న కాలనీలో ఉన్న మురుగు నీటి గుంత స్థానికులకు ఇబ్బందిగా మారింది. గుంతలో నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గుంత పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు పారిశుద్ధ్య సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో గుంతలో మరింత నీరు చేరి పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. వెంటనే స్పందించి గుంతను మట్టితో పూడ్చి పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# విజయవాడ బైపాస్‌పై కబలించిన మృత్యువు..

## తల్లీకుమారుడి సహా ముగ్గురి దుర్మరణం



**గన్నవరం జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ కొత్త బైపాస్‌పై బీబీ గూడెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ (ఎఱయిఝుఝుఝు చీవషం) నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ పంక్చరై అదుపుతప్పి ముందు వెళ్తున్న కారు, ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయిల్ ట్యాంకర్.. ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు, బైక్‌పై వెళ్తున్న ఒకరు మృతిచెందారు. గన్నవరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కారులో మృతిచెందిన వారిని కైకలూరు మండలం పెంచికలమర్రుకు చెందిన తల్లి జయమంగళ నాగదుర్గ (28), ఆమె కుమారుడు కారుణ్య నాగసాయి (3)గా గుర్తించారు. నాగదుర్గ భర్త విజయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తూ మృత్యువాత పడిన వ్యక్తిని సింగ్‌నగర్‌కు చెందిన దాసరి వెంకటేశ్వరరావు (50)గా గుర్తించారు. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమైంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తాళ్లూరు మండలంలోని విద్యుత్ స్టేషన్‌లో ట్రయల్ రన్

**తాళ్లూరు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని గుంటిగంగ సమీపాన నిర్మించిన 132/33 కేవీ పవర్ విద్యుత్ స్టేషన్ మంగళవారం ట్రయల్ రన్ చేపట్టారు. వివిధ ఫీడర్లలో, లైన్‌లకు విద్యుత్ సరఫరా చేసి పరిశీలించారు. ఏపీ ట్రాన్స్‌కో విజయవాడ ఎస్ఈ భాగ్యరాజు స్వయంగా పరిశీలించారు. మిగిలిన అతి స్వల్ప పనులను మరో వారం పది రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఇది ఉపయోగంలోకి తీసుకొస్తే తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి, చీమకుర్తి మండలాల్లోని 12 విద్యుత్ ఉప కేంద్రాలకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఎస్ఈ మోహన్ రావు, ఏడీఈ రామాంజనేయులు, ఇతర అధికారులు, సిబ్బంది, గుత్తేదారు సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

# కంచికచర్లలోని డ్రైనేజీ దెబ్బకు మోడల్ కాలనీ విలవిల...!



**నందిగామ జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్లలోని మోడల్ కాలనీ చర్చి రోడ్‌లో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరి నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. కాలనీలో నివసించే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. నిల్వ ఉన్న మురుగు నీటితో దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు. వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# వృషభాలను అలంకరించి, అభిమానాన్ని చాటుకుని!



**విడపనకల్లు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వృషభాలను అలంకరించి, తమ నాయకులపై ఉన్న అభిమానాన్ని రైతులు చాటుకున్నారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలోని ఆయా గ్రామాలలో ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం సాయంత్రం చీకలగురికీలో ఎద్దులకు పరుగు పందేలను చేపట్టారు. ఎద్దుల కొమ్ములకు రంగులు పూసి, అందంగా అలంకరించారు. పలువురు రైతులు వాటి కొమ్ముల మధ్య అభిమాన నాయకులైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల చిత్రపటాలతో పాటు సినీ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ చిత్రపటాలను, తెదేపా జెండాలను ప్రదర్శించారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణాసంచాను పేల్చుతూ, తప్పెట్ల శబ్దాల మధ్య గ్రామంలో వృషభాలను ప్రదర్శించారు. ఆ తర్వాత గ్రామంలో ప్రధాన వీధుల్లో వాటిని భారీ జన సందోహం మధ్య పరుగు పందేలను నిర్వహించి, విజేతలగా నిలిచిన వాటిని గ్రామంలో ప్రత్యేకంగా ఊరేగించారు. అలాగే పాల్తూరు, హావలిగి గ్రామాలలో కూడా ఈ వేడుకలు చేపట్టారు. అంతక ముందు ఉదయాన్నే ఎద్దులకు స్నానాలు చేయించి కొమ్ములకు రంగులు కొట్టి, పూలమాలలతో వాటిని అలంకరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కార్మికుల పిల్లలకు ఉచిత ఆన్‌లైన్ నైపుణ్య శిక్షణ



**గుంటూరు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికశాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సభ్యత్వ కార్డు కలిగిన కార్మికుల పిల్లల కోసం 'ఇండస్ట్రీ రెడీ ఆన్‌లైన్ స్కిల్ అప్‌గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' గుంటూరులో ప్రారంభమైందని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆశారాణీ తెలిపారు. ఆరండల్ పేటలోని కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం శిక్షణ బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్మికుల పిల్లలు ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప కమిషనర్ గాయత్రి దేవి మాట్లాడుతూ.. డిప్లొమా, డిగ్రీ, బీటెక్, మెడికల్ కోర్సులు చదువుతున్న భవన నిర్మాణ కార్మికుల పిల్లలు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమంలో నమోదు చేసుకుని ప్రయోజనం పొందాలని కోరారు. ప్రీ-రికార్డెడ్ వీడియోల రూపంలో అందించే ఈ కోర్సులను విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో ఇంటి నుంచే మొబైల్ ద్వారా అభ్యసించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎల్‌లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి: చిర్రి బాలరాజు



**బుట్టాయగూడెం జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. బుట్టాయ గూడెం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోమాతకు పూజ చేశారు. రైతులకు వరి విత్తనాలు, పశుపోషకులకు యాభై శాతం రాయితీపై పశు దాణా పంపిణీని చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలుతో వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల ఏడీలు బుజ్జిబాబు, రమణయ్య, ఏవో బాలాజీ, ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు పొట్టా రామారావు, కొండేపాటి రామకృష్ణ, ఆర్డీవో రమణ, తహసీల్దారు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**రాయచోటి జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాయచోటిలోని మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాసవారీ నిఘాలో భాగంగా యంత్రాల భద్రత, బీయూ, సీయూ, వీవీ ప్యాట్‌లను పరిశీలించారు. గోదాము వద్ద 24/7 పటిష్ట నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు. పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.




## స్టార్‌డమ్ వచ్చేలోపే ఇలాంటి గొడవలా?



'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాతో ఇప్పుడిప్పుడే పాపులారిటీ తెచ్చుకుంటున్న యంగ్ హీరో అఖిల్ రాజ్ ఒక సామాన్య డెలివరీ బాయ్‌తో గొడవ పడటం సోషల్ మీడియాలో కాంట్రవర్సీగా మారుతున్న విషయం తెలిసిందే. అయితే కెరీర్ స్టార్టింగ్ లోనే ఇలాంటి వివాదాల్లో ఇరుక్కుంటే మొదటికే మోసం వస్తుంది. ఎంత కష్టపడి పైకి వచ్చినా, ప్రజల్లో ఉండే ఇమేజ్ ఒక్కసారి నెగటివ్‌గా మారితే ఆ ఇంపాక్ట్ నుండి బయటపడటం చాలా కష్టం. వైరల్ అవుతున్న వీడియోలో హీరో సదరు వ్యక్తిపై నటుడు కోపంగా దూసుకురావడం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక సెలబ్రెటీగా సామాన్య ప్రజలతో ఎంత స్నేహపూర్వకంగా ఉంటే కెరీర్‌కు అంత పాజిటివ్ ప్లస్ అవుతుంది. పొరపాట్లు ఎవరికైనా జరుగుతుంటాయి, కానీ వాటిని డీల్ చేసే విధానంలోనే ఒక నటుడి మెచ్యూరిటీ కనిపిస్తుంది. ఆన్లైన్ లో ఒకసారి బ్యాడ్ నేమ్ వస్తే ఆ మచ్చను చెరిపేసుకోవడం అంత తేలికైన విషయం కాదు. అఖిల్ రాజ్ ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే ఒక మంచి పొజిషన్‌కు చేరుకుంటున్నారు. ఇంటర్ పూర్తి కాగానే ఫోటోగ్రాఫర్‌గా, యాంకర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి షార్ట్ ఫిలిమ్స్ చేశారు. గతేడాది కేవలం రెండున్నర కోట్ల బడ్జెట్‌తో వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించిన రాజు వెడ్స్ రాంబాయి సినిమా జీవితాన్ని మార్చేసింది. ఆ క్యారెక్టర్ కోసం ఎంతో కష్టపడి డప్పు కొట్టడం నేర్చుకున్న అఖిల్ శ్రమను అందరూ మెచ్చుకున్నారు. ప్రస్తుతం పెద్ద బ్యానర్‌లో కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి. అయితే ఈ ఘటనలో అసలు నిజం ఏంటి, అబద్ధం ఏంటి అనేదానిపై పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. ఇలాంటి ఇష్యూస్ ను కేవలం సోషల్ మీడియా ట్రోలింగ్ వరకే పరిమితం చేయకుండా ఇరువర్గాలు కూర్చొని సార్ట్ అవుట్ చేసుకుంటేనే అందరికీ మంచిది. ఈ గొడవను ఎంత పెద్దది చేస్తే హీరో కెరీర్‌కు అంత డ్యామేజ్ జరుగుతుంది. తప్పు ఎవరి వైపు ఉన్నా సరే, కూల్‌గా కూర్చొని మాట్లాడి సమస్యను ఇక్కడితో ముగించేయడమే బెస్ట్ ఆప్షన్ అని మరికొందరు నెటిజన్లు చెబుతున్నారు.

## విశ్వంభర కోసం చిరు మళ్లీ దిగుతాడా?



మెగాస్టార్ చిరంజీవి కెరీర్లో అనౌన్స్‌మెంట్లోనే అత్యంత క్రేజ్ తెచ్చుకున్న చిత్రాల్లో విశ్వంభర ఒకటి. 'బింబిసార' లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు వశిష్ఠ.. యువి క్రియేషన్స్ లాంటి పెద్ద బేనర్.. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాను గుర్తు చేసే ఫాంటసీ జానర్.. ఇలా సినిమా మొదలైనపుడు ప్రతి విషయం ఎంతో క్యూరియాసిటీ పెంచాయి. కానీ ఈ సినిమా టీజర్ లాంచ్ అయ్యాక మొత్తం మారిపోయింది. అందులో విజువల్స్ అంచనాలకు తగ్గట్లు లేకపోవడంతో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. దీంతో టీం ఆత్మరక్షణలో పడిపోయింది. విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం మొదలుపెట్టడంతో సినిమా విపరీతంగా ఆలస్యం అయింది. మొదలైన మూడేళ్లకు కూడా విడుదలకు నోచుకోవట్లేదు. ఐతే ఈ సినిమా షూటింగ్ అయితే ఏడాది కిందటే పూర్తయినట్లు వార్తలు వచ్చాయి. కానీ విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం, పూర్తి సంతృప్తి వచ్చే వరకు రాజీ పడకూడదని నిర్ణయించు కోవడం తోనే సినిమా ఇంత ఆలస్యం అవుతోంది. వీఎఫెక్స్ కంటెంట్ పక్కాగా రెడీ అయితేనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తారని భావిస్తున్నారు. ఇలాంటి టైంలో మళ్లీ విశ్వంభర షూటింగ్ అంటూ వార్తలు వస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని.. కానీ ఆ కంటెంట్‌కు మ్యాచ్ అయ్యేలా కొత్తగా ఈ సినిమాలో ఒక ఎపిసోడ్‌ను జోడించాల్సి ఉందని.. అందుకోసం మళ్లీ కొన్ని ఒక షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇందుకోసం చిరు అటు ఇటుగా ఒక వారం రోజులు కేటాయించాల్సి ఉందట. ప్రస్తుతం చిరు.. బాబీ దర్శకత్వంలో సినిమా కోసం పని చేస్తున్నారు. ఆ సినిమా షెడ్యూల్స్‌కు ఇబ్బంది రాకుండా విశ్వంభర కోసం కొన్ని రోజులు కేటాయించాలని చూస్తున్నారట. ఆ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి దసరాకు విశ్వంభరను ప్రేక్షకుల ముందుకు తేవాలని దర్శక నిర్మాతలు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

## శుభాకాంక్షలు సరే... శుభవార్త ఎక్కడ



ఇవాళ అల్లరి నరేష్ పుట్టినరోజు. ఆయనతో సినిమాలు చేస్తున్న నిర్మాణ సంస్థలు ఒక్కొక్కటిగా గ్రీటింగ్స్ చెబుతూ సోషల్ మీడియాలో కొత్త పోస్టర్లు విడుదల చేస్తున్నాయి. సెప్టెంబర్ 4 'రంభ ఊర్వశి మేనక' వస్తుందని అధికారికంగా ప్రకటించారు. అయితే మన టాపిక్ అది కాదు. అల్లరి నరేష్ హీరోగా రూపొందిన 'ఆల్కహాల్' ఎప్పుడో షూటింగ్ పూర్తి చేసుకుంది. గత ఏడాది టీజర్ తో పాటుగా 2026 జనవరి 1 మూవీ రిలీజ్ ఉంటుందని సితార ఎంటర్ టైన్మెంట్స్ అఫీషియల్ గా అనౌన్స్ మెంట్ ఇచ్చింది.

అంతే ఆ తర్వాత ఉలుకు పలుకు లేదు. ఆల్కహాల్ టీజర్ వచ్చి 9 నెలలు దాటేసింది. ఇప్పటి దాకా రిలీజ్ డేట్ ఎప్పుడో చెప్పలేదు. తాజాగా వదిలిన కొత్త పిక్ లో హీరోకి శుభాకాంక్షలు చెప్పారు కానీ అసలైన శుభవార్త మాత్రం అందులో లేదు. మెహర్ తేజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రుహాని శర్మ, నీహారిక ఎన్ఎం హీరోయిన్లు కాగా సత్య తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషించారు. గిబ్రాన్ సంగీతం అందించడం లాంటి బలమైన టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేసింది. కంటెంట్ విషయంలో ఏదైనా జాప్యం జరుగుతోందో లేక ఓటిటి డీల్ లాంటి చిక్కులు ఏమైనా ఏర్పడ్డాయో తెలియదు కానీ ఆల్కహాల్ పేరుకి తగ్గట్టే ఒక వర్గం మూవీ లవర్స్ అటెన్షన్ అయితే లాగింది. మందు అలవాటు లేని ఒక యువకుడి జీవితంలో జరిగిన సంఘటనలను ఆధారంగా చేసుకుని ఈ సినిమా తీశారట. టీజర్ లో అదే హైలైట్ చేశారు. ఇంత వెరైటీ కాన్సెప్ట్ తీసుకున్నారు కాబట్టి ప్రెజెంటేషన్ కూడా అదే స్థాయిలో ఉంటే జనాలకు కనెక్ట్ కావొచ్చు.. ఇంతకీ ఆల్కహాల్ ని థియేటర్ రిలీజ్ చేసే ఉద్దేశంలో నిర్మాత నాగవంశీ ఉన్నారో లేదో అంతు చిక్కడం లేదు. ఇదే బ్యానర్ లో గౌతమ్ తిన్ననూరి తీసిన 'మ్యాజిక్' కూడా ఇదే తరహాలో మోక్షం కోసం ఎదురు చూస్తోంది. ఇంత అగ్ర నిర్మాణ సంస్థ నుంచి పేరున్న హీరోల సినిమాలే ఇలా రిలీజ్ గుమ్మం దగ్గర ఆగిపోవడం విచిత్రమైన విషయం. బడ్జెట్ ఇష్యూస్, బిజినెస్ సమస్యలు లేని ఇలాంటి వాటికి ఆటంకాలు ఎదురు కావడమంటే సంథింగ్ ఫిషీ అనుకోవాలి. అదేంటో మరి.

## ఇద్దరు టైమింగ్ హీరోలు కలిసి నటిస్తే



మాస్ హీరోయిజంలో కామెడీ మిక్స్ చేసి మెప్పించడంలో రవితేజకు సాటి రావడం అంత ఈజీ కాదు. తన ముద్రని మ్యాచ్ చేయాలంటే చాలా కష్టపడాలి. చిన్న చిన్న మాటలు వాడి ఒక డిఫరెంట్ స్టయిల్ తో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో శ్రీవిష్ణుది విలక్షణమైన శైలి. ఈ ఇద్దరూ కలిసి నటిస్తే ఎలా ఉంటుందో వేరే చెప్పాలా. రాజరాజ చోర -- స్వాగ్ ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించబోయే మూవీలో ఈ కాంబినేషన్ సెట్ అయిపోయిందని ఫిలిం నగర్ టాక్. త్వరలోనే ఇది సెట్స్ పైకి వెళుతుందని సమాచారం. దీని స్టోరీ లైన్, రవితేజ వేయబోయే పాత్ర గురించి ఆ మధ్య సోషల్ మీడియాలో కొన్ని పుకార్లు చక్కర్లు కొట్టాయి కానీ అవేవి నిజం కాదట. 2027 సంక్రాంతి విడుదలని టార్గెట్ చేసుకుని ఈ సినిమా రూపొందిస్తారని తెలిసింది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైన్మెంట్ తో పాటు చిన్న కమర్షియల్ టచ్ తో కూడిన మెసేజ్ చాలా బలంగా ఉంటుందని ఇన్ సైడ్ న్యూస్. ముఖ్యంగా ఈ కాంబోలో పూయించే నవ్వులు ఓ రేంజ్ లో ఉంటాయట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రవితేజ ఇరుముడి చివరి దశ షూటింగ్ లో ఉన్నారు. ఇది ఆగస్ట్ 21 విడుదలయ్యేలోపు హసిత్ గోలి సెట్స్ లో అడుగు పెట్టొచ్చు. ఇది కాకుండా వివేక్ ఆత్రేయ డైరెక్షన్లో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు టాక్ ఉంది. ఇరుముడి తీస్తున్న మైత్రి మూవీ మేకర్సే నిర్మాతగా వ్యవహరించడానికి అవకాశాలున్నాయి. ఏ మాత్రం గ్యాప్ ఇవ్వకుండా వరసగా సినిమాలు చేసేలా మాస్ రాజా రవితేజ ప్లానింగ్ మాములుగా లేదు. ఇక శ్రీవిష్ణు విషయానికి వస్తే 2026 తనకు అంతగా కలిసి రాలేదు. విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ నిరాశ పరచగా స్పెషల్ క్యామియో చేసిన గాయపడ్డ సింహం దారుణంగా పోయింది. ఓ రెండు నిముషాలు కనిపించిన నారి నారి నడుమ మురారి ఒకటే హిట్ అయ్యింది. అందుకే ఆశలన్నీ రాబోయే కామ్రేడ్ కళ్యాణ్ మీద పెట్టుకున్నాడు. ఆల్రెడీ ప్రమోషన్లు మొదలుపెట్టేశారు. దీంతో ట్రాక్ లోకి వస్తాననే నమ్మకం శ్రీవిష్ణులో వ్యక్తమవుతోంది. సితార బ్యానర్ లో మరో సినిమా నిర్మాణంలో ఉంది.



# బిజినెస్ న్యూస్



## ఇక నంబర్ కనిపించదు.. యూజర్ నేమ్ రిజర్వ్ చేసుకోండి: వాట్సప్



వాట్సప్ యూజర్ల కోసం టెక్ సంస్థ మెటా మరో కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. వినియోగదారుల ప్రైవసీని కాపాడేందుకు కొత్తగా యూజర్‌నేమ్ ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఫోన్ నంబర్‌ను ఎవరికీ షేర్ చేయకుండానే ప్రత్యామ్నాయమార్గంగా యూజర్‌నేమ్‌తో చాట్ చేసేందుకు వీలుకలగనుంది. ఈ ఏడాది చివర్లో విస్తృతస్థాయిలో ఈ ఫీచర్ అందుబాటులోకి రానుందని మెటా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకొనే ఆప్షన్‌ను ప్రారంభించింది. ఆర్థిక, వ్యక్తిగత అంశాల్లో ఫోన్ నంబర్ అత్యంత కీలకం. దానిని కొత్తవారితో షేర్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు కొంత తటపటాయిస్తుంటాం. ఈ ఇబ్బందిని తొలగించి, యూజర్ ప్రైవసీని కాపాడేందుకు వాట్సప్ ఈ ఫీచర్‌ను తీసుకువచ్చింది. దీంతో నంబర్ షేర్ చేయకుండానే యూజర్ నేమ్‌తో ఇతరులతో కాంటాక్ట్ అవ్వొచ్చు. ఒక వ్యక్తిని తొలిసారి కాంటాక్ట్ చేయాలంటే యూజర్ నేమ్ తెలిసి ఉండాల్సిందేనని వాట్సప్ వైస్ ప్రెసిడెంట్ (ప్రొడక్ట్) అలిస్ న్యూటన్ వెల్లడించారు. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినా.. ప్రైవసీ కోసం ఇప్పటికే ఉన్న బ్లాక్, సైలెన్సింగ్ అన్‌నోన్ కాలర్స్ వంటి నియంత్రణలు కొనసాగుతాయని చెప్పారు. ఇక రిజర్వ్ చేసుకోవాలనుకున్న యూజర్ నేమ్ మూడు నుంచి 35 అక్షరాల పొడవు ఉండొచ్చు. ఇందులో ఖ-ఓ, 0-9, డాట్, అండర్ స్కోర్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఇఇఇ, చివర్లో .ఇశీఎ, .అవ్ వంటివి ఉపయోగించకూడదు. అదనంగా 4 అంకెలతో యూజర్ నేమ్ కీ కూడా సెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఎవరైనా మిమ్మల్ని మొదటిసారి కాంటాక్ట్ చేయాలంటే వారికి మీ యూజర్ నేమ్‌తో పాటు ఆ కీ కూడా షేర్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఖాతాలున్న క్రియేటర్లు, వ్యాపార సంస్థలు వంటివి ఇప్పుడున్నవాటికి మ్యాచ్ అయ్యేలా యూజర్ నేమ్ పొందేందుకు సంస్థ వీలు కల్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వినియోగదారులున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ఐరోపా, ఆసియా, ఇతర ప్రాంతాల్లో దీని వినియోగం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో కట్టుదిట్ట గోప్యతకు డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే యూజర్ నేమ్ ఫీచర్ గురించి ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సప్ ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అక్కడ యూజర్ నేమ్ సెట్ చేసుకునే ఆప్షన్ ఉందో లేదో చూడొచ్చు. లేకపోతే రాబోయే కొన్ని రోజుల్లో మీకు ఈ అప్‌డేట్ పొందే అవకాశం ఉంటుంది.

## స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి ఫైర్-బోల్ట్ ఎంట్రీ



స్మార్ట్‌వాచ్‌లు, వేరియబుల్స్‌ను తయారు చేసే భారత కంపెనీ ఫైర్-బోల్ట్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. రూ.10 వేల నుంచి రూ.15వేల ధర లోపే ఫోన్లను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కొన్ని నెలలకు అవసరమైన సరఫరా చైన్ కోసం 50 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.475 కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టనుందని కంపెనీ వ్యవస్థాపకుడు అర్నవ్ కిశోర్ వెల్లడించారు. "ఏఐ కారణంగా మెమొరీ చిప్‌ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం బడ్జెట్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్లు దొరకడం కష్టంగా మారింది. ఈ లోటును పూడ్చేందుకు మేం వస్తున్నాం. కస్టమర్లకు అందుబాటులో ఉండేలా రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపే బోల్ట్ ఓఎస్‌తో ఫోన్లను తీసుకొస్తాం. ఆగస్టు కంటే ముందే 4జీ ఫోన్లను, ఆ తర్వాత 5జీ ఫోన్లను లాంచ్ చేస్తాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికగా విక్రయిస్తాం" అని అర్నవ్ తెలిపారు. ప్రీమియం సెగ్మెంట్ వైపు ఎక్కువ లాభదాయకత ఉండటంతో చైనా కంపెనీలు అటువైపు మళ్లుతున్నాయని అర్నవ్ అన్నారు. అందుకే కస్టమర్లకు అందుబాటు ధరల్లో భారతీయ బ్రాండ్‌ను పరిచయం చేయాలనే ఆలోచన వచ్చిందన్నారు. ఇందుకు ఆగస్టు వేదిక కానుందని తెలిపారు. ఈ మేరకు తొలుత పది లక్షల ఫోన్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

## రెండో రోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ వంటి ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు దోహా వేదికగా ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం రాణించాయి. సెన్సెక్స్ 249 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,005.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,728.37) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,037.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 76,329.39 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 249.70 పాయింట్ల నష్టంతో 76,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.50 కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నెల్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్ లాభపడ్డాయి. ఐటీసీ, హిందూస్థాన్‌లీవర్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 94.66గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.21 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 4,025.73 వద్ద కొనసాగుతోంది.

## కరుగుతోన్న పసిడి కాంతులకు కారణాలు ఇవే..



గడిచిన కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలకు చేరుకుంటూ సామాన్యులకు చుక్కలు చూపించిన పసిడి ధరలు, ఇటీవల అనూహ్యంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ రోజు (జూన్ 30, 2026) హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు సుమారు రూ.1,40,000 మార్కు వద్ద ట్రేడ్ అవుతుండగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర సుమారు రూ.1,29,000 స్థాయికి దిగివచ్చింది. గత వారంతో పోలిస్తే ఇది భారీ పతనమనే చెప్పాలి. ఈ ఆకస్మిక మార్పునకు గల ఆర్థిక కారణాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, భవిష్యత్తులో బంగారంపై రాబడులు అందుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై విశ్లేషణాత్మక కథనం మీకోసం.

**ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలు**

పసిడి మార్కెట్ ఒడిదుడుకులను గమనిస్తే ప్రస్తుతం మూడు ప్రధానాంశాలు ఈ పతనానికి కారణమవుతున్నట్లు స్పష్టమవుతోంది.

**1. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వైఖరి**

అమెరికా కేంద్రీయ బ్యాంక్ (యూఎస్ ఫెడరల్ రిజర్వ్) వడ్డీ రేట్లను తగ్గిస్తుందని ఈ ఏడాది ఆరంభంలో అంచనా వేసినప్పటికీ తాజా పాలసీ సమావేశంలో వడ్డీ రేట్ల తగ్గింపును 2027కు వాయిదా వేసింది. అంతేకాకుండా, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చనే సంకేతాలు ఇచ్చింది. వడ్డీ రేట్లు పెరిగితే బాండ్లు, ఇతర స్థిర ఆదాయ వనరులపై రాబడి పెరుగుతుంది. దీంతో వడ్డీ లేదా డివిడెండ్ ఇవ్వని బంగారం వైపు నుంచి ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు.

**2. బలపడుతున్న అమెరికన్ డాలర్, బాండ్ ఈల్డ్స్**

ఫెడ్ నిర్ణయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో యూఎస్ డాలర్ ఇండెక్స్ ఏడాది కాలంలోనే గరిష్ట స్థాయికి చేరుకుంది. సాధారణంగా డాలర్ బలపడితే ఇతర కరెన్సీలలో బంగారం కొనడం ఖరీదైనదిగా మారుతుంది. తద్వారా డిమాండ్ తగ్గి ధరలు క్షీణిస్తాయి. గ్లోబల్ గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి, ముఖ్యంగా ఆసియా మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లడం దీనికి అద్దం పడుతోంది.

**3. పశ్చిమాసియాలో సడలిన ఉద్రిక్తతలు**

గత కొద్ది నెలల్లో బంగారం ధరలు భారీగా పెరగడానికి రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా (ఇరాన్-అమెరి కా/ఇజ్రాయెల్) సంక్షోభాలు ప్రధాన కారణం. అయితే ఇటీవల ఇరాన్, అమెరికాల మధ్య శాంతి చర్చల సరళి, కీలకమైన హోర్ముజ్ జలసంధి పాక్షికంగా తెరచుకోవడం వంటి పరిణామాల వల్ల గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు దాదాపు 30% తగ్గాయి. దాంతో అంతర్జాతీయ ఒడిదొడుకులు తగ్గి సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఉన్న డిమాండ్ ప్రీమియం ఒక్కసారిగా ఆవిరైపోయింది.

**భవిష్యత్తులో ఇన్వెస్ట్‌మెంట్ మార్గాలు**

ప్రస్తుత ధరల తగ్గుదల అనేది దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఒక అవకాశంగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే కేంద్ర బ్యాంకుల వద్ద డీ-డాలరైజేషన్ (డాలర్‌పై ఆధారపడటం తగ్గించడం) ప్రక్రియలో భాగంగా బంగారాన్ని నిల్వ చేసుకునే ధోరణి ఇంకా కొనసాగుతోంది. అయితే కేవలం భౌతిక బంగారం (నగలు) రూపంలో కాకుండా కొన్ని మార్గాల్లో పెట్టుబడి పెడితే మెరుగైన రాబడులు సాధించవచ్చు.

గోల్డ్ ఈటీఎఫ్‌లు: స్టాక్ మార్కెట్ ద్వారా డిజిటల్ రూపంలో బంగారం కొనుగోలు చేయడానికి ఇది ఉత్తమ మార్గం. ఇందులో ఎలాంటి మేకింగ్ ఛార్జీలు, తరుగు ఉండవు. మనకు నచ్చినప్పుడు కరెంట్ మార్కెట్ ధరకే విక్రయించుకోవచ్చు.

# తిరుమలలో పదే పదే నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి పైన పిడి యాక్ట్



**తిరుమల,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో భక్తులను బెదిరిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీసు టీటీడీ సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న అలవాటు నేరస్థుడు గోగుల కోటయ్య పై ఆంధ్రప్రదేశ్ ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు అమలయ్యాయి. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ నిందితుడి నేరచరిత్రను పరిశీలించి, ప్రజా శాంతి భద్రతలకు, ముఖ్యంగా తిరుమలకు వచ్చే భక్తుల భద్రతకు ముప్పుగా ఉన్నట్లు నిర్ధారించి పీడీ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. తిరుమలలో రౌడీయిజం, గూండాయిజం, భక్తులను వేధించడం, అక్రమ కార్యకలాపాలు, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు కొనసాగుతాయని తిరుపతి జిల్లా పోలీసులు హెచ్చరించారు.

# ఆంజనేయ స్వామికి విశేష పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముక్కంటి ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం ప్రక్కన ఉన్న అచ్యుతరాయ మండపంలోని స్తంభంలో కొలువైన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వేద పండితులు స్వామికి పాలు పెరుగుతో అభిషేకం చేశారు. తమల పాకులతో అలంకరించి సింధూరం దిద్దారు. పూలమాలవేసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

# నేడు పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులతో వీడియో కాన్ఫరెన్స్

**-ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి జులై 1వ తేదీన ఉదయం 11గం॥ల నుంచి 12 గం॥ల వరకు వీడియో కాన్ఫరెతన్స్ ను నిర్వహించనునట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వ్యవస్థలో లోటుపాట్లు, ఓల్టేజ్ మార్పులు, బిల్లింగ్, సోలార్ మీటరింగ్, ఓపెన్ యాక్సెతోపాటు భద్రతా అంశాలకు సంబంధించిన సమస్యలను పారిశ్రామిక వినియోగదారులు చర్చించేందుకు వీలుగా ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతి నెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు మొబైల్ నంబరు: 8977779471కు కాల్ చేయడం ద్వారా వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ లో విద్యుత్ సమస్యపై చర్చించి, పరిష్కరించుకునేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లింకును సంబంధిత వినియోగదారులకు పంపడం జరిగిందని తెలిపారు.

# 'శ్రీ మహాలక్ష్మి దీప పూజ'ను విజయవంతం చేయండి

**- ఎమ్మెల్యే పులివర్తి నాని**

**- సుమారు 2000 మంది మహిళలతో వైభవంగా నిర్వహించనున్న టీటీడీ**

**చంద్రగిరి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ కోదండరామస్వామి వారి ఆలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 'శ్రీ మహాలక్ష్మి దీపం పూజ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని పిలుపునిచ్చారు. ఈ మహా పూజా కార్యక్రమ ఏర్పాట్లు, నిర్వహణపై స్థానిక మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు టీటీడీ అధికారులతో ఎమ్మెల్యే పులివర్తి నాని ఒక ముఖ్య సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, చంద్రగిరి ప్రాంత ఆడపడుచుల సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, నియోజకవర్గ సుభిక్షం కాంక్షిస్తూ టీటీడీ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. సుమారు 2000 మంది మహిళలతో అత్యంత భక్తిశ్రద్ధలతో, నభూతో నభవిష్యతి అనే రీతిలో ఈ దీప పూజ జరగనుందని పేర్కొన్నారు. ఈ పూజలో పాల్గొనే ప్రతి ఒక్క మహిళా భక్తురాలికి టీటీడీ తరఫున ఉచితంగా ప్రమిద (దీపం), రైక (బ్లౌజ్ పీస్), పసుపు, కుంకుమతో పాటు పూజకు అవసరమైన ఇతర సకల సామగ్రిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి వేలాదిగా మహిళా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎక్కడా ఎలాంటి చిన్న లోటుపాట్లు రాకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి వసతి, చలువ పందిళ్లు, సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల వాహనాలకు విశాలమైన పార్కింగ్ సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా మరియు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి పుణ్యభూమిపై జరుగుతున్న ఈ విశేష పూజా మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బాధ్యత తీసుకుని, క్షేత్రస్థాయిలో భక్తులకు సేవలు అందించాలని ఎమ్మెల్యే నాని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో టీటీడీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.




# చంద్రగిరి నియోజకవర్గంలో భూకబ్జాలపై సీబీఐ దర్యాప్తు జరపాలి

**-నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఐరాల లోకేష్ డిమాండ్**

**తిరుపతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గంలో భూకబ్జాలపై సీబీఐ దర్యాప్తు జరపాలని ఆ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఐరాల లోకేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పక్ష నాయకులు నియోజకవర్గంలో యధేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే రాత్రికి రాత్రి రికార్డులు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారని వారి ఆగడాలకు ఎంఎల్ఏ అండదండలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. అవిలాల,పేరూరు, మంగళం తదితర ప్రాంతాలలో అధికార పక్ష నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని, కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో భూకబ్జాలు జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రగిరి నియోజవర్గంలో నిత్యకృత్యంగా జరుగుతున్న భూ కబ్జాలపై సీబీఐ దర్యాప్తు జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లోకేష్ డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి మూడు రోజుల జిల్లా పర్యటనక సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

**-అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు తిరుపతి జిల్లా పర్యటనతో పాటు పలువురు వీవీఐపీల పర్యటనలు ఉండనున్న నేపథ్యంలో అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో లోటు,పాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, నగరపాలకు సంస్థ ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి, డిఆర్ఓ నరసింహులు, అడిషనల్ ఎస్పీలతో కలిసి ముందస్తు ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1 నుంచి 3వ తేదీ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి, పలువురు వీవీఐపి ల జిల్లా పర్యటన నేపథ్యంలో అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లాలో రెండు రోజుల పాటు బస చేయనున్నందున భద్రత,




ప్రోటోకాల్, వసతి, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, తాగునీరు, అగ్నిమాపక, ఆహార భద్రత తదితర అంశాల్లో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హీరో మోటోకార్ప్-శ్రీ సిటీ, రైల్వే కోడూరు, తాజ్ హోటల్, కలెక్టరేట్ తదితర ప్రధాన కార్యక్రమ ప్రాంతాల్లో విధులు కేటాయించిన సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని,ముఖ్యమంత్రి పర్యటనతో పాటు జిల్లాకు విచ్చేస్తున్న ఇతర వీవీఐపీల కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వీవీఐపీ పర్యటనల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ ను సమర్థవంతంగా నిర్వహించాలని, అవసరానికి మించి వాహనాలను నిలిపివేయకుండా రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. వివిఐపి లు జిల్లా పర్యటనకు విచ్చేయునప్పుడు పాటించవలసిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ని యధావిధిగా పాటించాలన్నారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనలను విజయవంతం చేయాలన్నారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు నుంచి కార్యక్రమ వేదికలు, బస చేయు ప్రాంతాల వరకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, యాక్సెస్ కంట్రోల్, కాన్వాయ్ నిర్వహణ, నైట్ హాల్ట్ భద్రత, బాంబ్ డిటెక్షన్ తనిఖీలు, ఫైర్ సేఫ్టీ, విద్యుత్ స్టాండ్ బై, వాహనాల సమీకరణ, తదితర అంశాల్లో నిర్ణీత ప్రోటోకాల్ మేరకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రోటోకాల్, ఆర్ అండ్ బీ, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, రవాణా, ఆహార భద్రత, అధికారులు పాల్గొన్నారు.

# జనసేన పదవులకు దరఖాస్తుల వెల్లువ



**తిరుపతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి పార్లమెంట్ జిల్లా జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కి పార్టీ పదవుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. మంగళవారం ఉదయం ముక్కు అండ్ ముక్కు ఫంక్షన్ హాల్ లో సమాచార సేకరణ కమిటీ పరిశీలకురాలు, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ లు పాల్గొన్నారు. మెంబర్ టు లీడర్ షిప్ లో భాగంగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కార్యకర్తలు, నాయకుల నుంచి పదవులకు నేరుగా దరఖాస్తులను తీసుకునేందుకు సమాచార సేకరణ కమిటీ లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బాధ్యతాయుతమైన కొత్త నాయకత్వాన్ని అందించేందుకు పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. కుల మత బేధాలు లేకుండా పదవులను పారదర్శకంగా కార్యకర్తలు, నాయకులకు అందేలా పవన్ కళ్యాణ్ సమాచార సేకరణ కమిటీ లను ఏర్పాటు చేశారని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ చెప్పారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పరిశీలకురాలు లోకం నాగ మాధవి తెలిపారు. మంగళవారం పూర్తిగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె చెప్పారు. బుధ, గురు, శుక్రవారాల్లో తిరుపతి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల నుంచి ఎన్జీఓ కాలనీలోని ఎస్ బి ఐ మిద్దిపైన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.

# వీరవర్మది నిజమైన వసుదైక కుటుంబం

**-లౌకికవాదాన్ని కుటుంబంలో ఆచరించిన వ్యక్తి**

**-సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు**

**తిరుపతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అవనిగడ్డ వీర వర్మ కుటుంబం నిజమైన వసుదైక కుటుంబం అని, కుల మతాలకు అతీతంగా లౌకికవాదాన్ని ప్రోత్సహించిన వ్యక్తి అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు పేర్కొన్నారు. అవనిగడ్డ వీర వర్మ 84వ జయంతి సందర్భంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నేటి తరం ఎదుర్కొంటున్న సవాల్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందరపు మురళి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాఘవులు మాట్లాడుతూ వీర వర్మ చిన్నతనం నుంచే పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని, పోస్టల్ ఉద్యోగ సంఘంలో ఉన్నప్పుడే ఉద్యమాల్లో పని చేశారని తెలిపారు. ఆయన కుటుంబంలో కులం, మతం భేదాలు లేవని, కట్న కానుకల సమస్యలే లేవని, అవనిగడ్డ కుటుంబాన్ని చూస్తే, నిజమైన భారతదేశాన్ని చూసినట్టు ఉంటుందని పేర్కొన్నారు. తనకు తెలిసిన మంచిని నలుగురికి చెప్పే తపన ఉన్న వ్యక్తి వీర వర్మ అన్నారు.

**ప్రస్తుతం శ్రమ దోచుకునే వారిదే కాలం**

ప్రస్తుతం శ్రమ చేసే వారికి విలువ లేదని దోచుకునే వారిదే కాలమని బివి రాఘవులు ఎద్దేవా చేశారు. నేటి పాలకులు జాతీయ సంపదను దోచేస్తూ, లేబర్ కోట్ల పేరుతో కార్మికుల జీవితాలను కాలరాస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సమయంలో ఐక్య ఉద్యమాల అవసరం అన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 8న ప్రారంభమై ఇంకా కొనసాగుతుందన్నారు. యుద్ధ ప్రభావం భారతదేశంలో అధికంగా ఉందని, క్రూడ్ ఆయిల్, గ్యాస్, నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం ప్రజలపై భారాలు పెరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని ప్రధాని మోడీ కనీసం ప్రకటన కూడా చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత పాలకులు అమెరికాకు సహాయం చేయడానికి దేశానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉంటే ఆదానే అంబానీ ఆదాయాలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఇప్పుడు అమెరికాతో భారత్ కొత్త ఒప్పందం చేసుకుంటుందని, దీనివల్ల విదేశాల నుంచి వచ్చే మొక్కజొన్న సోయాబీన్స్ కోళ్ల పరిశ్రమలు డైరీ ఉత్పత్తులకు ట్యాక్స్ భారీగా తగ్గిస్తున్నారని. దీనివల్ల దేశంలో రైతులు, ఉత్పత్తిదారులు దివాలా తీస్తారని తెలిపారు. దేశంలో మోడీ ప్రభుత్వం లౌకికవాదానికి తూర్పు పొడుస్తోందని, రాష్ట్రంలో టిడిపి జనసేన సైతం హిందూ ధర్మాన్ని సంరక్షిస్తామని, ఆర్ఎస్ఎస్ భావాలను భుజాన వేసుకుంటున్నాయని ధ్వజమెత్తారు. రాజ్యాంగ విలువలను నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వారికి అప్పనంగా అప్పగించేస్తూ, దేశ ప్రజలకు కనీసం ఉపాధి భరోసా కూడా లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయాలను సైతం విచిత్రంగా ఉన్నాయని అధికారంలో ఉన్న టిడిపి, జనసేనలు మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ సైతం మోడీ వెంటే ఉన్నారని విమర్శించారు. తాజాగా దేశంలో సన్ పేరుతో ఓట్లు మాయం చేసే తంతు జరుగుతుందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందని తెలిపారు.

# విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం


**-ప్రమాదాల నివారణపై వినియోగదారుల్లో చైతన్యం**

**-పోస్టర్లను ఆవిష్కరించిన ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి**



**తిరుపతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నేటి సమాజంలో విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ భద్రతపై ఎపిఎస్పిడిసిఎల్ విజిలెన్స్ విభాగం రూపొందించిన పోస్టర్ ను తిరుపతిలో ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సామర్థ్యం, భద్రతా చర్యలు, నిబంధనల అమలు అంశాలపై ఈ యేడాది జూన్ 26న ప్రారంభమైన అవగాహనా కార్యక్రమాలు జులై 2వతేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడమే ధ్యేయంగా సంస్థ పరిధిలో సర్కిల్, డివిజన్, సబ్-డివిజన్, సెక్షన్ల స్థాయిల్లో విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించేదుకు కృషి చేస్తున్నామని వివరించారు. విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం వుంటుందన్నారు. గృహోపకరణాల అంశంలో వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వినియోగించాలని సూచించారు. ఇంటి వైరింగును నిపుణుడైన ఎలక్ట్రిషియన్ తో తరచూ తనిఖీ చేయిస్తూ, పాడైన పరికరాలను వెంటనే మార్చుకోవాలని, ఎర్తింగ్ ను తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. బలమైన గాలి వర్షం సందర్భాల్లో ప్రజలు విద్యుత్ లైన్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు దగ్గరగా నిల్చోవద్దని సూచించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ ప్రమాదాలు జరిగినట్లయితే వినియోగదారులు వెంటనే తమ సమీపంలోని విద్యుత్ సిబ్బందికి లేదా అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సంస్థ పరిధిలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా విద్యుత్ భద్రతపై ప్రత్యేకంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, సిహెచ్ రామచంద్రరావు, ఎన్. శోభా వాలెంటీనా, ఎస్. రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రావు, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1 కోటి విరాళం



**తిరుమల, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ఓ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1 కోటి విరాళాన్ని అందించింది. సంస్థ ప్రతినిధులు తరుణ్, రమేష్ మంగళవారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా పేద ప్రజల ప్రాణరక్షణకు చేయూతనిచ్చే మహోన్నత సేవలో భాగస్వాములైన అపర్ణ సంస్థ యాజమాన్యాన్ని చైర్మన్ బి.ఆర్. నాయుడు అభినందిస్తూ, వారి దాతృత్వాన్ని కొనియాడారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027